సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



అక్రమ కట్టడాలు కూల్చివేయాలి

గిరిజనేతరుల అక్రమ కట్టడాలను కూల్చివేయాలని ఆదివాసీ జేఏసీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రామారావుదొర డిమాండ్ చేశారు.

8లో



వైద్య సేవల పట్ల నిర్లక్ష్యం తగదు

రోగులకు వైద్య సేవల పట్ల నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతగా పనిచేయాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా సూచించారు.

8లో



25,363 గృహాల మంజూరు

పీఎం జన్‌మన్‌లో 25,363 గృహాలు మంజూరు అయ్యాయని హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.బాబు తెలిపారు.

8లో

న్యూస్‌రీల్

లభ్యం కాని వైద్య విద్యార్థి హరదీప్ ఆచూకీ

మారేడుమిల్లి : మండలంలోని **జలతరంగిణి** జలపాతంలో కొట్టుకుపోయి గల్లంతైన **ఏలూరు** ఆశ్రం వైద్య విద్యార్థి హరదీప్ **ఆచూకీ బుధ**వారం కూడా లభ్యం కాలేదు. ఆది**వారం నుంచి** రెవెన్యూ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు విస్తృతంగా గాలిస్తున్నారు. వాగులు, కొండకాలువలను పరిశీలించారు. అయినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదని అధికారవర్గాలు తెలిపాయి.

రంపచోడవరం డీడీగా కొండలరావు బాధ్యతలు స్వీకరణ



రంపచోడవరం: రంపచోడవరం గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఐ. కొండలరావు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల చదువు, ఆరోగ్యంపై పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తామని, దీనిలో భాగంగా హెల్త్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

జాబ్ కార్డుదారులకు వంద రోజుల పని

- రంపచోడవరం పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: ఏజెన్సీలో ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు గల ప్రతీ కుటుంబానికి వంద రోజుల పనిదినాలు కల్పించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. ఉపాధి హామీ పథకంపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొత్త పనుల కోసం గ్రామ సభలు తీర్మానాలతో నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రస్తుతం చేస్తున్న ఉపాధి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు.ఉపాధి హామీ పథకం అమలులో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీడీ జి.శ్రీనివాసరావు, పీఏవో ఎల్.రాంబాబు పాల్గొన్నారు.

బైండోవర్ నోటీసులపై పీవోకు వినతి

ఎటపాక: మండలంలోని గిరిజనులకు తహసీల్దార్ బైండోవర్ నోటీసులు ఇవ్వడంపై గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కాక అర్జున్‌దొర, ఇరప అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ భూములను ఆక్రమించి గిరిజన, గిరిజనేతరుల మధ్య వివాదాలకు కారణమయ్యారనే కారణంతో తహసీల్దార్ ఏజెన్సీలో గిరిజనులకు నోటీసులు ఇవ్వడం సరైనది కాదన్నారు. ఈ విధంగా నోటీసులు ఇవ్వడం గిరిజనులు,గిరిజనేతరుల మధ్య వివాదాలు సృష్టించేలా ఉందన్నారు. ఈవిషయంపై న్యాయ పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.

ఇసుక తరలింపునకు అనుమతించం

- గరుడాపల్లి గ్రామస్తుల స్పష్టీకరణ



గరుడాపల్లికి సమీపంలోని ఇసుక క్వారీ వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

హుకుంపేట: తమ ప్రాంతంలోని క్వారీల నుంచి ఇసుక రవాణాను అడ్డుకుంటామని గరుడాపల్లి గ్రామస్తులు బుధవారం స్పష్టం చేశారు. మండలంలోని తీగలవలస పంచాయతీ గరుడాపల్లి గ్రామ గిరిజనులు బుధవారం ఇసుక క్వారీల వద్ద నిరసన చేపట్టారు. ఇసుక అక్రమ రవాణకు అధికారులు అనుమతి ఇచ్చినప్పటికీ తాము తవ్వకాలకు అనుమతించమన్నారు. గరుడాపల్లితో పాటు పాములురాయి,రాతులపుట్టు ప్రాంత ఇసుక క్వారీల్లో కూడా తవ్వనీయమన్నారు. ఒక వేళ అధికారులు అనుమతిస్తే ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా వల్ల తమ ప్రాంతంలో వనరులు కోల్పోతున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కిల్లో కోటిబాబు, వైఎస్సార్‌సీపీ నేతలు పెలమల రమేష్, గ్రామ పెద్దలు కొర్ర మత్స్యరాజు, కామరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు : పాడేరులో ఉన్న 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నిమిత్తం పాడేరు, జి.మాడుగుల మండలాల్లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పాడేరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.వి.ఎస్.ఎం .అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నామినేటెడ్.. ఫ్రస్టేటెడ్

- నామినేటెడ్ పదవులు దక్కని నేతల్లో నైరాశ్యం
- పార్టీకోసం కష్టపడినా గుర్తింపు లేదని మండిపాటు
- పార్టీ నిర్ణయంపై అసంతృప్తి

అధికార పార్టీలో అసంతృప్తుల గోల!



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అధికారపార్టీ కూటమి నేతల్లో అసంతృప్తి మొదలైంది. మొదటి దఫా నామినేటెడ్ పోస్టుల్లో పదవులు దక్కని నేతలందరూ ఫ్రస్టేషన్‌కు గురవుతున్నారు. పార్టీ నిర్ణయంపై మండిపడుతున్నారు. పార్టీలో మొదటి నుంచీ కష్టపడిన తమకు గుర్తింపు దక్కకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. సీటు ఆశించి దక్కకపోయినా పార్టీ గెలుపు కోసం కష్టపడిన తమను గుర్తించకపోవడంపై అసంతృప్తిని వెలిబుచ్చుతున్నారు. ప్రధానంగా పార్టీలో సీనియర్లుగా ఉన్న తమకు కాకుండా కొద్ది మందికి మాత్రమే పదవులు వరించడాన్ని ఆహ్వానించలేకపోతున్నారు. అటు టీడీపీతో పాటు ఇటు జనసేన పార్టీలో ప్రధానంగా ఈ అసంతృప్తులు ఎక్కువగా ఉన్నారు. సీట్ల సర్దుబాటు పేరుతో తమకు సీటు దక్కకపోయినప్పటికీ మిన్నకుండిపోయామని... కూటమి పార్టీ గెలుపు కోసం కష్టపడిన తమకు ఇచ్చే గుర్తింపు ఇదేనా అని వాపోతున్నారు.

ఇరు పార్టీల్లోనూ ఇదే లొల్లి...!

కూటమి పార్టీల్లో ప్రధానంగా టీడీపీ, జనసేన పార్టీల నుంచి ఎక్కువగా అసంతృప్తి వ్యక్తమవుతోంది. జనసేన పార్టీకి చెందిన ఏ ఒక్కరికీ కూడా ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కలేదు. కేవలం టీడీపీకి చెందిన పీలా గోవింద్‌కు మాత్రమే పదవి వరించింది. దీంతో ప్రధానంగా జనసేన నేతల్లో వ్యతిరేకత కనిపిస్తోంది. ఇక తెలుగుదేశం పార్టీలో కూడా సీనియర్లుగా ఉండి.. ప్రతిపక్షంలో కూడా పార్టీతో పాటు ఉండి.. నియోజకవర్గంలో కలియతిరిగిన తమను గుర్తించకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

- యలమంచిలి నియోజకవర్గానికి చెందిన ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది.
- జనసేన పార్టీ నుంచి భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పంచకర్ల సందీప్, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పసుపులేటి ఉషాకిరణ్‌లు పొత్తులో సీటును కోల్పోయారు. దీంతో వీరిద్దరూ తమకు ఏదో ఒక పదవి దక్కకపోతుందా అని ఆశించారు. ఈ జాబితాలో వీరికి మొండిచెయ్యి ఎదురైంది.
- విశాఖ దక్షిణ సీటు ఆశించి భంగపడిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీకి నామినేటెడ్ పోస్టు దక్కలేదు. పైకి ఏమీ మాట్లాడనప్పటికీ లోలోన మాత్రం ఈయన కూడా మండిపడుతున్నట్టు సమాచారం.
- పార్టీలో సీనియరు నేతలుగా ఉన్న మహమ్మద్ నజీర్, విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి మాజీ కార్పొరేటర్ సన్యాసిరావు... గతంలో ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించారు. టికెట్ రాకపోవడంతో నామినేటెడ్ పోస్టును ఆశించారు.
- గతంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడరుగా పనిచేసిన పట్టాభికి కూడా నిరాశే ఎదురైంది.
- దాడి వీరభద్రరావు కుమారుడు దాడి రత్నాకర్ ఎమ్మెల్సీ పదవి లేదా ఏదైనా నామినేటెడ్ చైర్మన్ పోస్టు ఆశించారు. అతడికి మొండి చెయ్యి చూపడంతో బయటికి ఏమీ మాట్లాడకపోయినా దిగువ కేడర్ నుంచి తనకు పదవి ఇవ్వాలనే డిమాండ్ ఉండేలా సంకేతాలు పంపిస్తున్నారు.
- మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు మరోసారి ఎమ్మెల్సీగా చేయాలని ఉంది అని సన్నిహితుల వద్ద అంటున్నాడు.
- బీజేపీ సీనియర్ నాయకుడు పరుచూరి భాస్కరరావు రాష్ట్ర బీజేపీ నుంచి ఏదైనా పదవి వస్తాదేమో అని ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఏ ఒక్క జనసేన, బీజేపీ నేతకు ఎటువంటి కార్పొరేషన్ చైర్మన్ పోస్టు దక్కకపోవడం ఆ పార్టీ నేతల్లో చర్చనీయాంశమవుతోంది.

ఏజెన్సీలో అదే వేడి...!

ఒకవైపు వర్షాలతో సాధారణ వాతావరణం కొద్దిగా చల్లబడినప్పటికీ... రాజకీయ వాతావరణం మాత్రం వేడెక్కుతోంది. ఏజెన్సీలో మాజీ మంత్రి మణికుమారి, అరకు నుంచి టికెట్ ఆశించి... పోటీ నుంచి తప్పుకున్న దొన్నుదొరతో పాటు పాడేరులో సీనియర్ నేతలుగా ఉన్న చల్లంగి జ్ఞానేశ్వరి, ఎంవీఎస్ ప్రసాద్‌లతో పాటు జనసేన నుంచి పాడేరు టికెట్ ఆశించిన వొంపురి గంగులయ్యలకు ఎటువంటి పదవులు దక్కలేదు. వీరంతా పార్టీ నిర్ణయంపై అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. పార్టీని నమ్ముకున్న తమకు ఎటువంటి పదవులు ఇవ్వకపోవడంపై మండిపడుతున్నట్టు సమాచారం. పార్టీలో మొదటి నుంచీ పనిచేసిన వారికి గుర్తింపు దక్కడం లేదని ఈ నేతలందరూ లోలోపల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తర్వాత ప్రకటించే నామినేటెడ్ పోస్టుల జాబితాలో కూడా తమకు గుర్తింపు దక్కకపోతే మాత్రం బహిరంగంగా అసంతృప్తి వెళ్లగక్కేందుకు కొద్ది మంది నేతలు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు త్వరలో పూర్తి అనుమతులు

అటవీ శాఖ విశాఖ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథ్‌రెడ్డి



ఫారెస్టు అధికారులతో చీఫ్ కన్సర్వేటర్ శ్రీకంఠనాథ్‌రెడ్డి

సీలేరు: పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన పూర్తి స్థాయి అటవీ అనుమతులు మంజూరు కానున్నాయని అటవీ శాఖ విశాఖ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథ్‌రెడ్డి వెల్లడించారు. సీలేరులో నిర్మించబోయే 1350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి అటవీ అనుమతులకుగాను రిజర్వ్ ఫారెస్టును బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 1350 మెగావాట్ల సామర్థ్యంతో పర్యావరణానికి అనుకూలంగా ఉండేలా ప్రాజెక్టును నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి సరిహద్దుల సర్వే, అంచనా సర్వే పూర్తయినట్టు చెప్పారు. దీనికి సంబంధించి జెన్‌కోకు 193 హెక్టార్ల అటవీ భూమి అవసరం ఉందన్నారు. సరిహద్దు, అంచనాల సర్వేలను పరిశీలించి పీసీసీఎఫ్‌కు నివేదిస్తామని చెప్పారు. దీనిపై రాష్ట్ర స్థాయి నుంచి మరొక అధికారి వచ్చి మరోసారి ప్రాజెక్టును పరిశీలించి అనుమతుల కోసం కేంద్రానికి నివేదిస్తారన్నారు. అరకు ఫారెస్టు కాంప్లెక్సు,అరకు పైనరీ, లంబసింగికి సమీపంలోని కృష్ణాపురం వద్ద ఎకో టూరిజం ప్రాజెక్టులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నర్సరీల్లో మొక్కలను పెంచి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ మేరకు విశాఖ సర్కిల్‌లో 75 లక్షల మొక్కలను పెంచాలని నిర్ణయించామని చెప్పారు. ఎన్ఆర్‌జీఎస్ ద్వారా ఈ నర్సరీల అభివృద్ధికి ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, పంప్డ్‌స్టోరేజ్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, రామభద్రరాజు (ఎస్ఈ,సివిల్) తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవలోనే ఆనందం

- ఎక్కడో మారుమూల జన్మించిన నాకు మాజీ సీఎం జగన్ అవకాశం కల్పించారు
- జెడ్పీ చైర్‌పర్సన్‌గా మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జల్లిపల్లి సుభద్ర



ఉద్యోగులు, అధికారులకు కేక్ తినిపిస్తున్న జిల్లా పరిషత్ చైరపర్సన్ జె.సుభద్ర

మహారాణిపేట(విశాఖ): ప్రజాసేవలో తనకు ఎంతో ఆనందం ఉంటుందని జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జెడ్పీ ఉద్యోగులు ఆమెను తన బంగ్లాలో బుధవారం మర్యాద`ఎపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ రాజకీయాలే పరిచయం లేని తనను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ సదవకాశాన్ని కల్పించారన్నారు. ఏ ఆశయ సాధన కోసం తనకీ అవకాశాన్నిచ్చారో, ఆ లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాలన్న జగన్మోహన్ రెడ్డి ఆకాంక్షలు నెరవేర్చేలా నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. గిరిజనులకు అందని ద్రాక్షగా మిగిలిన విద్య, వైద్యంలో సమూల మార్పులకు కృషి చేసిన సంతోషం తనకు దక్కిందన్నారు. కేజీహెచ్ ఎస్టీ సెల్ అంటే భయపడే స్థితి నుంచి అక్కడ మెరుగైన వైద్యం అందుతుందన్న నమ్మకాన్ని గిరిజనుల్లో పెంచేందుకు జరిగిన కృషిలో తన భాగస్వామ్యాన్ని అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రావాలన్న జగన్ ఆశయ సాధన దిశగా తాను కూడా అడుగులు వేసినందుకు సంతోషంగా ఉందన్నారు. తనకు ఇచ్చిన అవకాశం మేరకు పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



హాజరైన ఏటీడబ్ల్యూవోలు,హెచ్‌ఎంలు



సమావేశంలో మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం: ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో బుధవారం ఏటీడబ్ల్యూవో, హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నిబంధనల ప్రకారం మెనూ అందించాలన్నారు. విద్యార్థుల ఎలా చదువుతున్నారో అనేదానిపై రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు అనారోగ్యంగా ఉంటే దగ్గరలోని ఆస్పత్రికి తరలించాలని సూచించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోకి అనుమతి లేకుండా ఎవర్నీ అనుమతించవద్దన్నారు. ఆశ్రమ పాఠశాలలను అధికారులు తరచూ సందర్శించాలని ఆదేశించారు. డీడీ కొండలరావు మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం పాఠశాలల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ఒక గ్రూపు ఏర్పాటు చేయాలన్నారు. సకాలంలో ఉపాధ్యాయులు విధులకు హాజరు కావాలన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

పాడేరు : డిసెంబర్ 24న జరగనున్న ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల 3 వరకు గడువు పొడిగించినట్టు డీఈవో బ్రహ్మాజీ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజనల్ ఎస్‌బీఐ కలెక్ట్ రశీదులను తమ కార్యాలయంలో వచ్చేనెల 14లోగా అందజేయాలని సూచించారు. ప్రభుత్వ, జెడ్పీ, ఎయిడెడ్, ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ రూ.3.5 లక్షల వార్షిక ఆదాయం ఉన్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. పరీక్ష రాసే సమయంలో విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఫీజు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లో లేదా పాడేరులోని తమ కార్యాలయాన్ని సందర్శించాలని ఆయన సూచించారు.

కొత్త బంగారులోకం

ఎటుచూసినా దట్టమైన అడవి.. పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణం.. జలపాతాలసవ్వడి.. చుట్టూ ప్రకృతి సోయగాలు.. వీటి మధ్య ప్రయాణం.. ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది కదూ.. త్వరలో అందుబాటులోకి రానున్న రాజమహేంద్రవరం- విజయనగరం జాతీయ రహదారి 516–ఈ నిర్మాణం ఈ అనుభూతిని మిగల్చనుంది. మన్యం దిశ తిరగనుంది.



- జాతీయ రహదారి 516–ఈ నిర్మాణంతో మన్యానికి మహర్దశ
- పెరగనున్న పర్యాటకుల రాక
- ప్రకృతి అందాల మధ్య కొత్త అనుభూతి ఇవ్వనున్న ప్రయాణం
- గిరి గ్రామాల అభివృద్ధికి దోహదం
- జనవరి నాటికి పూర్తయ్యే అవకాశం

రాజవొమ్మంగి/రంపచోడవరం: పర్యాటకానికి మన్యం మణిహారం. ఏటా నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు వేల సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారు విశాఖ చేరుకుని అక్కడి నుంచి సుమారు వంద కిలోమీటర్లకు పైగా ప్రయాణించి ఎన్నో అవస్థలు పడి మన్యానికి చేరుకుంటున్నారు. కొద్దినెలల్లో రాజమహేంద్రవరం- విజయనగరం జాతీయ రహదారి (516–ఈ) అందుబాటులోకి రానుండటంతో వీరికి అవస్థలు తప్పినట్టే. ఇటు కోనసీమ, రాజమహేంద్రవరం, విజయవాడ ప్రాంతాల నుంచి వచ్చేవారు రాజమహేంద్రవరం నుంచి తూర్పు కనుమల అడవుల మీదుగా సుమారు 200 కిలోమీటర్లు ప్రయాణిస్తే మన్యంలో అడుగుపెట్టవచ్చు. ఈ రహదారి విజయనగరం వద్ద చెన్నై–కోల్‌కత్తా హైవేకు అనుసంధానం కానుంది.

రూ.4 వేల కోట్లతో ప్రాజెక్ట్

జాతీయ రహదారిని రూ.4వేల కోట్లతో నిర్మిస్తున్నారు. ఆరు ప్యాకేజీల కింద పనులు చేపట్టారు. రాజమహేంద్రవరం నుంచి రంపచోడవరం వరకూ 44 కిలోమీటర్లు, రంపచోడవరం–కొయ్యూరు 74 కిలోమీటర్లు, కొయ్యూరు, చాపరాతిపాలెం, లంబసింగి మీదుగా పాడేరు వరకు 133 కిలోమీటర్లు, పాడేరు నుంచి అరకులోని బల్లుగుడ వరకు 49 కిలోమీటర్లు, బల్లుగుడ నుంచి బౌడార వరకు 40 కిలోమీటర్లు, బౌడార- విజయనగరం 25 కిలోమీటర్ల మేర ఈ ప్రాజెక్టును మూడు దశల్లో చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే కదలిక

రెండు లైన్లలో లోతట్టు గిరిజన గ్రామాలను అనుసంధానం చేస్తూ ఈ రహదారిని నిర్మిస్తున్నారు. మన్యంలో పర్యాటకం, రహదారి రవాణా సదుపాయాలను అభివృద్ధి చేయాలన్నది కేంద్రప్రభుత్వ సంకల్పం. ఈ రహదారి నిర్మాణం కోసం 2017లో కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయగా అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇందుకు అవసరమైన కీలకమైన డీపీఆర్ (డిటైల్డ్ ప్రోజెక్టు రిపోర్టు) ఇవ్వడంలో జాప్యం చేసింది. అయితే ఆ తరువాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సకాలంలో కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్ సమర్పించడంతో ప్రస్తుతం ఈ రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. డిసెంబర్, జనవరి నాటికి పనులు పూర్తయ్యే అవకాశం ఉందని ఎన్‌హెచ్ 516ఈ అధికార వర్గాలు చెబుతున్నాయి.

జాతీయ రహదారితో బహుళ ప్రయోజనాలు



జాతీయ రహదారి నిర్మాణం వల్ల బహుళ ప్రయోజనాలు చేకూరుతాయి. గిరిజన గ్రామాలు మరింత వేగంగా అభివృద్ధి చెందుతాయి. సందర్శకుల రాక పెరిగితే ఉపాధి అవకాశాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయి. పర్యాటకులు వచ్చేందుకు అనువైన మార్గం అందుబాటులోకి వస్తుంది.

– కల్పశ్రీ, సబ్ కలెక్టర్, రంపచోడవరం

జాతీయ రహదారి 516-ఈ ప్రాజెక్ట్ ప్యాకేజీల వివరాలు

అంచనా వ్యయం :	రూ.4 వేల కోట్లు
రాజమహేంద్రవరం-రంపచోడవరం :	44 కిలోమీటర్లు
రంపచోడవరం-కొయ్యూరు :	74 కిలోమీటర్లు
కొయ్యూరు-పాడేరు :	133 కిలోమీటర్లు
పాడేరు -బల్లుగుడ (అరకు):	49 కిలోమీటర్లు
బల్లుగుడ – బౌడార :	40 కిలోమీటర్లు
డార- విజయనగరం :	25 కిలోమీటర్లు
మొత్తం :	365 కిలోమీటర్లు

పర్యాటక ప్రాంతాల మీదుగా..

రంపచోడవరం, రాజవొమ్మంగి, అడ్డతీగల, కొయ్యూరు, కృష్ణదేవిపేట, రంపుల, పాడేరు, అరకు, చింతపల్లి వంటి పక్కా ఏజెన్సీ ప్రాంతాల మీదుగా జాతీయ రహదారి రూపుదిద్దుకుంటోంది. ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలన్నీ ఈ మార్గాన్ని ఆనుకుని ఉన్నాయి.

- కొత్తగా నిర్మిస్తున్న జాతీయ రహదారి నుంచి రంపచోడవరం మీదుగా 30 కిలోమీటర్లు ప్రయాణిస్తే ప్రముఖ పర్యాటక ప్రాంతం మారేడుమిల్లి చేరుకోవచ్చు. ఇక్కడి నుంచి 30 కిలోమీటర్ల దూరంలో గుడిసె పర్యాటక కేంద్రం ఉంది. ఈ ప్రాంతంలో జలతరంగిణి, అమృతధార జలపాతాలు ఉన్నాయి. రంప జలపాతాన్ని కూడా తిలకించవచ్చు.
- అడ్డతీగలకు సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో పింజరికొండ జలపాతం ఉంది.



హైవేను ఆనుకుని ఉన్న చాపరాయి జలపాతం

- రాజవొమ్మంగికి సుమారు పది కిలో చీకుధార జలపాతాన్ని సందర్శించవచ్చు. రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరం, కొయ్యూరు, మంప, కృష్ణదేవిపేటలోని అల్లూరి స్మారక ప్రాంతాలను సందర్శించవచ్చు.
- చింతపల్లి మండలంలో ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన లంబసింగి, చెరువులవేనం, తాజంగి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నాయి. జి.మాడుగుల మండలంలో కాస్త దూరం ప్రయాణిస్తే కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించవచ్చు.
- పాడేరు మండలంలో విశ్వవ్యాప్తి పొందిన వంజంగి కొండ, కాస్త దూరం వెళ్లగలిగితే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం, పర్యాటక ప్రాంతమైన మత్స్యగుండం క్షేత్రాన్ని సందర్శించవచ్చు.
- పర్యాటకంగా గుర్తింపు పొందిన చాపరాయి జలవిహారి కూడా ఇదే మార్గంలో ఉంది.
- అరకులో పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియం, అనంతగిరి మండలంలో బొర్రా గుహలు, గాలికొండ, కాఫీ ప్లాంటేషన్లను సందర్శించవచ్చు. జాతీయ రహదారిలో వెళ్లేవారు వీటిలో కొన్నింటినైనా తిలకించవచ్చు.

క్లుప్తంగా

ఇసుక తిన్నెల్లో ఆంజనేయస్వామి విగ్రహం

- ప్రతిష్టించేందుకు భక్తుల నిర్ణయం


ఆంజనేయస్వామి విగ్రహం

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి వద్ద మడేరు వాగులో ఆంజనేయస్వామి విగ్రహం కొట్టుకువచ్చింది. వాగు ఉధృతి తగ్గడంతో బుధవారం బయటపడింది. పసిడి వర్ణంలో ఆకర్షణీయంగా ఉండటంతో సురక్షితమైన చోట ప్రతిష్ఠించాలని భక్తులు నిర్ణయించారు.

సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు


ఎంపీపీ రమేష్

కొయ్యూరు: ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు చేపడుతోందని ఎంపీపీ బడుగు రమేష్ చెప్పారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా నియామకమై ప్రజలకు విశేష సేవలందిస్తున్న సిబ్బందిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపునకు పాల్పడుతుందన్నారు. ఈ మేరకు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించాలని ఆదేశాలు జారీ చేయడం దారుణమన్నారు. గతంలో చంద్రబాబు పాలనలో ఏ శాఖలోనూ ఉద్యోగాలు భర్తీ చేసిన దాఖలాలు లేవని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఒకేసారి 1,30,000 సచివాలయ ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగులు ఉపాధి కల్పించారన్నారు. సచివాలయ ఉద్యోగులకు స్టిక్కర్లు అతికించే పనులు అప్పగించడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా సిబ్బంది ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

రూరల్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు సమగ్ర సర్వే

కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: గిరిజన ఉత్పత్తులతో గ్రామీణ చిన్న తరహా పరిశ్రమల పార్కు ఏర్పాటుకు సమగ్ర సర్వే చేపట్టాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పరిశ్రమలు, వ్యవసాయం, ఉద్యానవన, పశుసంవర్ధకశాఖ,డీఆర్‌డీఏ, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులతో పాడేరు ఐటీడీఏ పరిధిలో పరిశ్రమల ఏర్పాటుపై బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో కాఫీ, మిరియాలు, పైనాపిల్, సీతాఫలాలు, అల్లం, పసుపు, చింతపండు, క్యాబేజీ, టమోటాలను గిరిజన రైతులు అధికంగా సాగు చేస్తున్నారన్నారు. చింతపల్లి మండలం గొందిపాకలు ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేస్తే గిరిజన రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. పైలట్ ప్రాజెక్టుగా తొలుత చింతపల్లి మండలంలో ఏర్పాటు చేసేందుకు సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు తయారు చేయాలని సూచించారు. పరిశ్రమ స్థాపనలో


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో హాజరైన అధికారులు

స్వయం సహాయక సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. అక్టోబర్ 2 నాటికి సర్వే పూర్తి చేయడంతో పాటు భూసేకరణ చేపట్టాలన్నారు. చిన్నతరహా పరిశ్రమల ద్వారా రైతులు, స్వయం సహాయక సంఘాలు ఆర్థికాభివృద్ధి చెందుతారని, వారపు సంతల్లో చిన్న తరహా మార్టులు ఏర్పాటు చేయాలన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో విజయవంతం

ఛత్తీస్‌గఢ్‌లో రూరల్ ఇండస్ట్రియల్ పార్కు విజయవంతంగా నడుస్తుందని, ఆ రాష్ట్రానికి చెందిన రూరల్ రినైసాన్స్ సంస్థ డైరెక్టర్ ప్రభార్ అండ్లే తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాట్లపై పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉత్పత్తి వ్యవస్థను ప్రోత్సహించడంతో రైతుల ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు.ఈ మేరకు బస్తర్‌లో చింతపండు అధికంగా పండుతుందని, చిన్న తరహా పరిశ్రమలతో పాటు సీ-మార్ట్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇండస్ట్రియల్ పార్కుకు రెండు ఎకరాల స్థలం, రూ.2కోట్ల మూలధన పెట్టుబడి ఉండాలన్నారు. ఐదు గ్రామాలను ఒక క్లస్టర్‌గా చేసి పరిశ్రమలు ఏర్పాటు చేస్తే గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీవాణిధర్‌రామన్, ఏడీ ఎం.నవీన్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ మురళీ, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన అధికారులు ఎస్‌బీఎస్.నందు, రమేష్‌కుమార్‌రావు, కాఫీ ఏడీ అశోక్, పీఎంయూ ప్రోగ్రామ్ అధికారి రాంగోపాల్, పశువైద్యాధికారి రాజకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేయాలి

- ఆదివాసీ జేఏసీ ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ రామారావు దొర డిమాండ్
- అరకులోయలో భారీ ర్యాలీ, మానవహారం


అరకులోయ సీఐతో జేఏసీ ప్రతినిధుల వాగ్వాదం

అరకులోయ రూరల్: గిరిజనేతరుల అక్రమ నిర్మాణలు పూర్తిగా కూల్చివేయాలని ఆదివాసీ జేఏసీ ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ రామారావుదొర డిమాండ్ చేశారు. అక్రమ కట్టడాలను నిరసిస్తూ అరకులోయలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ మైదానం నుంచి వైఎస్సార్ జంక్షన్ వరకు గిరిజనులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గిరిజనేతరుల ఆగడాలు మరింత పెరిగాయన్నారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని బినామీల పేరిట అక్రమ కట్టడాలకు పాల్పడుతున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో 1/70,పీసా చట్టాలకు వ్యతిరేకంగా అక్రమ నిర్మాణలు చేపట్టకూడదన్న నిబంధనలు ఉన్నా అమలుకావడం లేదన్నారు. అరకులోయ పట్టణంలో గిరిజనేతరుడు కాపుగంటి కృష్ణారావు వారి బంధువుల పేర్లతో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి, గిరిజన చట్టాలను కాలరాస్తున్నారన్నారు. నూతన రెవెన్యూ కార్యాలయానికి అనుకుని ఉన్న సుమారు 40 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఓ మాజీ విలేకరి కబ్జా చేయగా ఆయన దగ్గరనుంచి గిరిజనేతరుడు కాపుగంటి కృష్ణారావు కొనుగోలు అక్రమ కట్టాడాలకు పాల్పడ్డారని విమర్శించారు. ఆదివాసీ హక్కులు చట్టాలను కాపాడాల్సిన తహసీల్దార్ వేణుగోపాల్ గిరిజనేతరులను ప్రోత్సహిస్తున్నారన్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తప్పుడు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ ప్రధాన సూత్రధారి అని ఆరోపించారు. ఆయనపై పలుసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు లేవన్నారు. తక్షణం ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో పాడేరు ఐటీడీఏలో పనిచేసిన పీవోలుగా పనిచేసిన ఐఏఎస్ అధికారులు వెంకటేష్, శరత్‌కుమార్, శివశంకర్ ఐఏఎస్ అధికారులు ఏవిధంగా గిరిజన ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారో దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని కోరారు. ఆదివాసీ చట్టాలు హక్కులు కాపాడాల్సిన ఉన్నతాధికారులే కాలరాస్తున్నారన్నారు. ఇకపై తప్పుడు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తే ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో వారిపై మూకుమ్మడిగా దాడులకు దిగుతామని హెచ్చరించారు. అరకులోయ సీఐతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు శ్రీనివాస్ పడాల్, ఆదివాసీ జేఏసీకి చెందిన రాజుబాబు, మహదేవ్, ఆనంద్, అశోక్,బుద్ధు, గోపాల్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు సత్వర చర్యలు


కోటకొండల గ్రామస్తులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్

చింతపల్లి: మౌలిక సౌకర్యాల కల్పనకు సత్వర చర్యలు చేపడుతామని పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ అన్నారు. మండంలోని కుడుంసారీ పంచాయతీ పరిధిలో గత కోటగున్నలు, కోటగున్నల కాలనీ, కుడుముసారి, నిమ్మలపాడు గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఎఎన్‌ఎం సబ్ సెంటర్, తాగునీరు, డ్రైనేజీ, రహదారులను క్షుణంగా పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వపరంగా అందుతున్న పథకాలు, సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లోతుగడ్డ వంతెన నుంచి కోరుకొండ వరకు రోడ్డు, కల్వర్టులు, వంతెనలకు మరమ్మతులు చేపట్టాలని పలువురు గ్రామస్తులు సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్‌కు విన్నవించారు. అన్ని గ్రామాల్లోని పూర్తిస్థాయి త్రాగునీరు, డ్రైనేజీ, రహదారులు వంటి సౌకర్యాలు కల్పనకు తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. పంచాయతీ పరిధిలో కొండ ప్రాంతాలపై అనేక గ్రామాలు ఉన్నాయని, వాటికి రహదారి సౌకర్యం కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. తహసీల్దార్ రామకృష్ణ తదితరులున్నారు.

25,363 గృహాల మంజూరు

- హౌసింగ్ పీడీ, కొయ్యూరు ప్రత్యేకాధికారి బాబు

కొయ్యూరు: పీఎం జన్‌మన్‌లో 25,363 గృహాలు మంజూరు అయ్యాయని హౌసింగ్ పీడీ, కొయ్యూరు మండల ప్రత్యేకాధికారి బి.బాబు వెల్లడించారు. స్థానిక మండల పరిషత్‌లో బుధవారం ఏపీవో, ఏపీఎం, ఇంజనీరింగ్ సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకొక్క గృహానికి రూ.2.39 లక్షలు ఇస్తారన్నారు. 2016-17, 2017-18, 2021-22లో మంజూరై పూర్తికాని 2,498 గృహాలను అక్టోబర్ నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. పునాది స్థాయిలో ఉన్న 14,197 గృహాలు, అసలు ప్రారంభం కాని 1263 గృహాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలన్నారు. లేకుంటే ఏప్రిల్ నుంచి వారికి బిల్లులు రావన్నారు. పీవీటీజీలకు వచ్చిన గృహాల నిర్మాణాన్ని సకాలంలో పూర్తిచేసేలా పర్యవేక్షిస్తామన్నారు. ఇంజనీరింగ్ సహాయకులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

వైద్య సేవల పట్ల నిర్లక్ష్యం తగదు


పద్మాపురంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

చింతపల్లి: గిరిజన రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతగా పనిచేయాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా సూచించారు. బుధవారం ఆయన మండలంలోని లంబసింగి, తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. వైద్యసేవలు అందించే విషయంగా జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. ప్రాథమిక చికిత్స అందించిన తరువాత మాత్రమే నర్సీపట్నం, పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం సీజనల్ జ్వరాలతో పాటు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలు సోకే అవకాశం ఉందన్నారు. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. విద్యార్థిని పరీక్షించి మందులు అందజేశారు. తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పద్మాపురం, గొందిపాకల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాలను సందర్శించారు. ఈకార్యక్రమంల లంబసింగి, తాజంగి ఎంపీహెచ్‌ఈవోలు మురళి, స్వామి, చిట్టిబాబు, హెల్త్ సూపర్వైజర్లు నాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పండగలకు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ): పండగల వేళ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా భువనేశ్వర్-యశ్వంత్‌పూర్-భువనేశ్వర్‌ల మధ్య వయా దువ్వాడ మీదుగా స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ ప్రకటనలో తెలిపారు. భువనేశ్వర్-యశ్వంత్‌పూర్(02811) వీక్లీ ఏసీ స్పెషల్ ప్రతీ శనివారాల్లో భువనేశ్వర్‌లో రాత్రి 7.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 1.53 గంటలకు దువ్వాడకు, అక్కడ నుంచి 1.55 గంటలకు బయల్దేరి సోమవారం 12.15 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు అక్టోబరు 5వ తేదీ నుంచి నవంబరు 30వ తేదీ వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్-భువనేశ్వర్ (02812) వీక్లీ ఏసీ స్పెషల్ ప్రతీ సోమవారాల్లో తెల్లవారు 4.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 4.30 గంటలకు దువ్వాడకు, అక్కడ నుంచి 4.32 గంటలకు బయల్దేరి ఆదేరోజు మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటాయి. రైళ్లు అక్టోబరు 7వ తేదీ నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు నడుస్తాయి.

కూతురిపై తండ్రి అత్యాచారం

ఆరిలోవ(విశాఖ): పదమూడేళ్ల కూతురిపై ఓ తండ్రి అత్యాచారానికి పాల్పడినట్లు ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన చిత్తరంజన్ పాత్రో(40) కుటుంబంతో కొన్నాళ్ల క్రితం విశాఖ వచ్చి ఆరిలోవ ప్రాంతం ఆరిలోవ కాలనీలో ఉంటున్నారు. మద్యానికి బానిసైన పాత్రో కూలి పనులకు పెద్దగా వెళ్తేండేవాడు కాదు. అతని భార్య నగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పదమూడేళ్ల పెద్ద కుమార్తె తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ఆమె రెండు రోజులుగా కళ్లు తిరిగి తరగతి గదిలో పడిపోతుంది. మంగళవారం కూడా అదే మాదిరిగా కళ్లు తిరిగి పడిపోవడంతో ఆ బాలికను తరగతి ఉపాధ్యాయురాలు దగ్గరకు తీసుకొని ఆరా తీశారు. దీంతో ఆ బాలిక జరిగిన విషయమంతా ఆ ఉపాధ్యాయురాలికి వివరించింది. తన తల్లి ప్రతి రోజు రాత్రి డ్యూటీకి ఆస్పత్రికి వెళ్తుందని, దీంతో తన తండ్రి తనపై అత్యాచారం చేస్తున్నాడని తెలిపింది. దీంతో విస్తుపోయిన ఉపాధ్యాయురాలు విషయాన్ని హెచ్‌ఎం, తోటి ఉపాధ్యాయులకు తెలియజేసింది. వారు ఆరిలోవ పోలీసులకు తెలియజేశారు. పోలీసులు బాలికను విచారించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిత్తరంజన్ పాత్రోను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణ తెలిపారు.

విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసం

- పోలీసులను ఆశ్రయించిన బాధితుని తండ్రి
- దర్యాప్తులో 8 కేసుల నమోదు, 19 మంది అరెస్ట్
- నగరానికి చెందిన యువకుడిని రక్షించిన పోలీసులు
- ఇప్పటి వరకు 85 మందిని రక్షించిన పోలీసులు


బాధితునితో కలిసి వివరాలు వెల్లడిస్తున్న సీపీ డాక్టర్ శంఖ బ్రత బాగ్చి, జేసీపీ ఫకీరప్ప

అల్లిపురం(విశాఖ): తక్కువ చదివినా పర్లేదు, విదేశాల్లో ఉద్యోగం, రూ.లక్షల్లో సంపాదన పేరిట నిరుద్యోగ యువతను నమ్మిస్తూ, వారిని సైబర్ నేరాలకు పావులుగా కంబోడియా, మయన్మార్, బ్యాంకాక్ వంటి దేశాల్లో నిర్వహిస్తున్న చైనా కంపెనీలకి తరలిస్తున్న ఏజెంట్ల నుంచి నగర పోలీసులు ఇప్పటి వరకు 85 మందిని రక్షించారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వివరాలు వెల్లడించారు. బాధితుల ఫిర్యాదు మేరకు 8 కేసుల్లో 19 మందిని అరెస్ట్ చేశామన్నారు. అదే కేసులో తాజాగా మయన్మార్‌లో చిక్కిన చినముషిడివాడకి చెందిన యువకుడిని రక్షించినట్లు తెలిపారు. మయన్మార్‌లోని ఇండియా రాయబార కార్యాలయంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపి అక్కడ చిక్కుకున్న మరికొంత మందిని వెనక్కి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు.

తాజాగా పోలీసులు రక్షించిన చినముషిడివాడకు చెందిన బాధితుడు మాట్లాడుతూ హాస్పిటల్ సెక్టార్ నందు బ్యాంకాక్‌లో ఉద్యోగానికి ఎంపికై, ఏప్రిల్ 25న బ్యాంకాక్ విమానాశ్రయంలో దిగినట్లు తెలిపారు. డీఎంకే విమానాశ్రయంలో ఉండగానే గుర్తుతెలియని చైనీయులు కిడ్నాప్ చేసి, మయన్మార్‌లోని చైనీస్ కంపెనీకి తీసుకెళ్లారన్నారు. అక్కడ స్కామింగ్ జాబ్ చేయించేందుకు ప్రయత్నిస్తే నిరాకరించినందుకు తనను కొట్టి, నిర్బంధించారన్నారు తప్పనిసరి పరిస్థితుల్లో వారు చెప్పినట్లు చేయాల్సి వచ్చిందన్నారు. తర్వాత ఇండియా పంపించేయండని పదేపదే అడిగితే డబ్బులు డిమాండ్ చేశారని, చెల్లించలేనని చెప్పడంతో వేరే చైనీస్ కంపెనీకి బలవంతంగా పంపించినట్లు తెలిపారు. అక్కడి నుంచి మరో చోటుకి, తర్వాత ఇంకో చోటుకి మార్చుతూ కోర్టులో 1500 టీహెచ్‌బీ ఫైన్ కట్టించి, బ్యాంకాక్ ఇమిగ్రేషన్ ఆఫీస్‌కు అప్పగించారన్నారు. ఇండియన్ ఎంబసీ తన వివరాలను పరిశీలించి, ఇండియా నుంచి టికెట్ బుక్ చేయించుకోవాల్సిందిగా చెప్పడంతో, తన తండ్రి కమిషనర్‌ను కలిశారని, వారి సహకారంతో విశాఖ చేరుకోగలిగినట్లు వెల్లడించారు. తనను రక్షించి, భారత్‌కు రప్పించిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీపీ మాట్లాడుతూ విదేశీ ఉద్యోగ ప్రకటనలు, ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిందిగా హెచ్చరించారు.

ప్రాణం తీసిన పాత కక్షలు


తీవ్ర గాయాలతో రామకృష్ణ, కేజీహెచ్‌లో మృతి చెందిన రామలక్ష్మి

- అన్నదమ్ముల కుటుంబాల మధ్య ఆస్తి తగాదా
- పరస్పర దాడుల్లో తమ్ముడి కుమార్తె మృతి
- మృతురాలి భర్త పరిస్థితి విషమం
- నిందితుడైన అన్నకు సైతం గాయాలు

గొలుగొండ: భూ తగాదా అన్నదమ్ముల కుటుంబాల మధ్య చిచ్చు పెట్టింది. పరస్పరం దాడులు చేసుకొని, ప్రాణాలు తీసుకునే వరకు వెళ్లింది. బుధవారం జరిగిన ఘర్షణలో తమ్ముడి కుమార్తె మృతి చెందగా అల్లుడు కేజీహెచ్‌లో విషమ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్‌ఐ రామారావు, గ్రామస్తులు అందించిన వివరాల మేరకు... శ్రీరాంపురంలో చిటికెల తాతీలు, చిటికెల జోగునాయుడు అన్నదమ్ములు. ఇద్దరికీ గ్రామంలో సుమారు రెండు ఎకరాల భూమి ఉంది. వీరి మధ్య 2001 నుంచి గొడవలు జరుగుతున్నాయి. బుధవారం ఉదయం తాతీలు పొలం వద్దకు వెళ్లగా అతని తమ్ముడి కుమార్తె రామలక్ష్మి (40), అల్లుడు రామకృష్ణ (అబ్బులు) అక్కడ ఉన్నారు. పొలానికి నీరు విషయమై తాతీలు, రామకృష్ణల మధ్య కొట్లాట జరిగింది. తాతీలు భయంతో ఇంటికి పరుగెత్తి దాక్కున్నాడు. రామలక్ష్మి, ఆమె భర్త రామకృష్ణ తాతీలు ఇంటికి వెళ్లి అతనిని మళ్లీ కొట్టడంతో.. తాతీలు ఇంట్లో ఉన్న కత్తితో భార్యా భర్తలపై దాడి చేశాడు. ఈ దాడిలో రామకృష్ణ తలపై, రామలక్ష్మి చేతులపై బలమైన గాయాలయ్యాయి. ఒక చేయి పూర్తిగా తెగిపోవడంతో రామలక్ష్మి పరిస్థితి విషమంగా మారింది. వారిని తొలుత నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి, తర్వాత విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ ఆమె సాయంత్రం మృతి చెందింది. ఈ ఘటనలో తాతీలు మెడకు బలమైన గాయం కావడంతో గొలుగొండ పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతనిపై తొలుత హత్యాయత్నం కేసు నమోదు చేసి, రామలక్ష్మి మరణంతో హత్య కేసుగా మార్పు చేశారు. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ బుధవారం సాయంత్రం గ్రామంలో విచారణ నిర్వహించారు. గ్రామస్తులు, తాతీలు, జోగునాయుడు కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. విశాఖ కేజీహెచ్‌లో రామలక్ష్మి మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహిస్తారని సీఐ తెలిపారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- లారీని బైక్ ఢీకొని ఇద్దరు దుర్మరణం
- ఒకరికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీతాలు


నాగేశ్వరరావు ఫైల్)


నవీన్ (ఫైల్)

నక్కపల్లి: జాతీయ రహదారిపై ఉద్దండపురం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గొడిచర్ల గ్రామానికి చెందిన ఆవాల నవీన్ (18), కిల్లాడ నాగేశ్వరరావు (25), దేవవరం గ్రామానికి చెందిన దమ్ము సీతాలు ప్రాణ స్నేహితులు. ముగ్గురూ కలిసి మోటారు సైకిల్‌పై నక్కపల్లి నుంచి తుని వైపు వెళ్తున్నారు. ఉద్దండపురం సమీపంలో మోటారు సైకిల్ అదుపు తప్పి ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవీన్, నాగేశ్వరరావుల తలలకు బలమైన గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. సీతాలుకు కూడా తీవ్ర గాయాలు కావడంతో నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ముగ్గురు యువకులు వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన వారు. ఈ దుర్ఘటనతో గొడిచర్ల గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు నక్కపల్లి ఆస్పత్రికి చేరుకొని బోరున విలపిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం కోసం నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కుమారస్వామి తెలిపారు.

ఉక్కు అధికారి కుటుంబానికి గిన్నిస్ అవార్డు


గిన్నిస్ అవార్డు అందుకుంటున్న సునీత, జస్లీన్

ఉక్కునగరం(విశాఖ): స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగం డీజీఎం ఎం.వరప్రసాదరావు భార్య సునీత, కుమార్తె జస్లీన్‌లు గిన్నిస్ రికార్డు సాధించారు. మహిళా మనోవికాస్ వ్యవస్థాపకురాలు మాధవి సూరిభట్ల నేతృత్వంలో ఆదివారం నగరంలో జరిగిన పోటీల్లో 450 మంది అన్ని వయసుల చిన్నారులు, యువతులు, మహిళలు, వృద్ధులు పాల్గొన్నారు.ఇందులో పాల్గొన్న తల్లీ కూతురు అతి తక్కువ సమయంలో నూలు వస్త్రంతో 58,112 క్రోంచెట్ స్క్వేర్‌లు తయారు చేసి వరల్డ్ రికార్డు సాధించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లండన్ ప్రతినిధి స్వప్నిల్ డంగారికర్ 'లార్జెస్ట్ డిస్‌ప్లే ఆఫ్ క్రోంచెట్ స్క్వేర్స్ ' గా గిన్నిస్ రికార్డ్‌ను ధ్రువీకరించారు. ఈ మేరకు సునీత, జస్లీన్‌కు గిన్నిస్ రికార్డ్‌లు ప్రదానం చేశారు. సునీతకు ఈ అంశంలో ఇది రెండో గిన్నిస్ రికార్డు కాగా జస్లీన్‌కు ఇది మొదటిగిన్నిస్ రికార్డు. సునీత, జస్లీన్‌లు గిన్నిస్ రికార్డులు సాధించడంపై ఉక్కు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి వైశాఖీ నృత్యోత్సవం

- కళాభారతి వేదికగా అఖిల భారత శాస్త్రీయ నృత్యోత్సవం
- మూడు రోజుల పాటు 11 నృత్య ప్రదర్శనలు

మద్దిలపాలెం(విశాఖ): వైశాఖీ నృత్యోత్సవం-2024 స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో రోజూ సాయంత్రం నాట్యప్రియుల్ని సమ్మోహనం చేయనుంది. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో దేశం నలుమూలల నుంచి సనాతన, సంప్రదాయ నాట్య నిపుణులు ఒకే వేదిక మీదకు రానున్నారు. మూడు రోజులపాటు జరిగే నృత్యోత్సవంలో 11 వైవిధ్యభరిత బృంద, ఏకకేళీ నాట్య ప్రదర్శనలుంటాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో ప్రదర్శనలిచ్చే కళాకారులకు నిపుణుల కమిటీ ఎంపిక మేరకు ఏరోజుకారోజు అతిథుల చేతుల మీదుగా పురస్కారాలను అందించనున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఆర్ విక్రమ్ కుమార్(గౌడ్) తెలిపారు. ఈ నృత్యోత్సవాలను నాట్యప్రియులు ఉచితంగా తిలకించవచ్చన్నారు.

ప్రదర్శనల క్రమం

- తొలిరోజు(27)న పద్మశ్రీ ప్రతిభా ప్రహ్లాద్(న్యూఢిల్లీ) భరతనాట్యం, పౌశాలీ ఛటర్జీ బృందం (పశ్చిమ బెంగాల్) మణిపురి నాట్యం, జై మా దుర్గా కళాపరిషత్ బృందం(ఒడిశా) సంబల్‌పురి నృత్య ప్రదర్శనలు.
- రెండోరోజు(28)న పద్మశ్రీ ఇలియానా సిటారిస్టి బృందం(ఒడిశా) ఒడిస్సీ నాట్యం, నాట్యశ్రీ గీతానారాయణ్ సూదగాని(ఆంధ్రప్రదేశ్) కూచిపూడి, దుర్గా ఆర్య బృందం(జర్మనీ) కథక్, రీతూ ఆకాష్ లావని(నాగ్‌పూర్) జానపద నృత్య ప్రదర్శనలు.
- ఆఖరిరోజు(29)న కళైమామణి మూర్తి మాధవపెద్ది(తమిళనాడు) కూచిపూడి, రూపశ్రీ మహాపాత్ర బృందం(ఒడిశా) మహరి నృత్యం, నాట్యశ్రీ చిత్ర సుకుమారన్(కేరళ) మోహినీయాట్టం, కళింగ పైకా సృజనాత్మక బృందం(ఒడిశా) పైకా జానపద నృత్య ప్రదర్శనలు ఉంటాయి.

పురస్కారాల ప్రదానం

నృత్యోత్సవ్‌లో భాగంగా వైశాఖీ లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డులు పద్మశ్రీ ప్రతిభా ప్రహ్లాద్, పద్మశ్రీ ఇలియానా సిటారిస్టి బృందం, పద్మభూషణ్ గురు డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్సలెన్స్ అవార్డు-2024. డాక్టర్ పి.రమాదేవి(హైదరాబాద్) కూచిపూడి, దుర్గా ఆర్య బృందం(జర్మనీ)కు అందించనున్నారు.